లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

నిప్పుల కొలిమి...

కర్నూలు జిల్లాలో ఎండ మండుతోంది. భానుడి భగభగలు తీవ్రమవడంతో నిప్పుల కొలిమిని తలపిస్తోంది. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

- తీవ్రమైన భానుడి భగభగలు
- 43 డిగ్రీలకు చేరిన అత్యధిక ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మార్చి చివరి వారానికి భానుడు భగభగలాడుతూ ప్రస్తుతం నిప్పుల కొలిమిలా మారిపోయాడు. జిల్లాలో వేసవి తీవ్రత తీవ్రంగా పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ ఉగ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెల ప్రారంభంలో కర్నూలు నగరంలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో 36 డిగ్రీలు, ఆలూరులో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. మార్చి 26 నాటికి కర్నూలు, ఓర్వకల్లులో అధికంగా 39 డిగ్రీలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అది అమాంతం పెరగడంతో మంగళవారం జిల్లాలో ఆలూరులో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కర్నూలులో 42 డిగ్రీలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయంలో 41 డిగ్రీలు, ఆదోని, పత్తికొండలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని పేర్కొంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

మంగళవారం ఉష్ణోగ్రతలు ఇలా..

ఆలూరు	43
కర్నూలు	42
కోడుమూరు	41
ఎమ్మిగనూరు	41
మంత్రాలయం	41
ఆదోని	40
పత్తికొండ	40

మరింత పెరగనున్న వేడి

బుధవారం నుంచి జిల్లాలో ఎండ వేడిమి మరింత పెరగనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మంగళవారం కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఎండకు బయటకు రాకూడదని సూచిస్తున్నారు.

లోకేష్‌కు జనం నీరాజనం

- డప్పుల మోతతో హోరెత్తిన పాదయాత్ర
- నంద్యాల నియోజకవర్గంలోకి ప్రవేశం

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు/నంద్యాల రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జన ప్రభంజనంతో జాతరను తలపించింది. బండి ఆత్మకూరులోని క్యాంప్ వద్ద నుంచి 101 వ రోజు మంగళవారం సాయంత్రం నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించారు. మండలంలోని పార్నపల్లె, ఎ.కోడూరు గ్రామాల మీదుగా శ్రీశైలం నియోజకవర్గంలో యువనేత పూర్తి చేసుకుని నంద్యాల నియోజకవర్గంలోకి కొత్తపల్లె వద్ద ప్రవేశించింది. పాదయాత్రలో శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో పాటు ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లోకేష్‌తో కలిసి ముందుకు నడిచారు. అడుగడుగునా మహిళలు హారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. దారి వెంట టిడిపి శ్రేణుల బాణసంచా మోత, డప్పు చప్పుళ్లతో యువగళం పాదయాత్ర హోరెత్తింది. అనంతరం కొత్తపల్లి వద్ద మాజీ మంత్రులు భూమా అఖిలప్రియ, ఎన్ఎమ్‌డి.ఫరూక్, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, ఎవి.సుబ్బారెడ్డి ఘన స్వాగతం పలికారు.

125 కుటుంబాలు టిడిపిలో చేరిక

బండి ఆత్మకూరు మండలంలోని పార్నపల్లి గ్రామానికి చెందిన వైసిపి ముఖ్య నాయకులు పలువురు టిడిపిలో చేరారు. యువ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళ పాదయాత్ర పార్నపల్లి గ్రామానికి చేరుకోగానే గ్రామానికి చెందిన మాజీ సర్పంచి నర్ల ప్రమీలమ్మ భర్త బుల్లెట్ రాఘవరెడ్డి, కాజీపేట మురళీధర్ రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 125 కుటుంబాలు నారా లోకేష్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. స్వయానా నారా లోకేష్ వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

అవ్వకు లోకేష్ భరోసా : పార్నపల్లి గ్రామం మీదుగా యువగళం పాదయాత్ర సాగుతుండగా దారిపక్కన షేక్ హుసేన్ బేగ్ అనే వృద్ధురాలు సైకిల్ పంక్చర్ల షాపు నడుపుతూ లోకేష్‌కు కనిపించారు. ఆమెతో లోకేష్ మాట్లాడారు. ఏడాది క్రితం కిడ్నీ సమస్యతో భర్త చనిపోవడంతో, గతంలో తాను నేర్చుకున్న సైకిల్ పంక్చర్లు ఇప్పుడు ఉపాధిగా మారిందని వివరించారు. హజ్ యాత్రకి వెళ్లాలనేది జీవితకాల కోరిక అని, దాని కోసం తినీ తినక ఓ పదివేలు దాచుకున్నానని, హజ్ వెళ్లాలంటే లక్షలు ఖర్చవుతాయని తెలిసి, దాచుకున్న ఆ పది వేలతో పేద మహిళలకు చీరలు కొని పంచేశానని చెప్పారు. హజ్ యాత్రకు తన సొంత ఖర్చుతో పంపుతానని షేక్ హుసేన్ బేగ్‌కు లోకేష్ భరోసా ఇచ్చారు.

‘తిరుమలగిరి’లో
పది రోజులుగా నీటి ఎద్దడి

- పట్టీపట్టని నగర పాలక సంస్థ అధికారులు
- ప్రయివేట్ వ్యక్తుల జోక్యం...
- ప్రజల నుంచి అక్రమ వసూళ్లు
- 28వ వార్డులో పర్యటించిన పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగర పాలక సంస్థ పరిధి 28వ వార్డు, తిరుమల గిరి టౌన్ షిప్ కాలనీలో పది రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ కాలనీ వాసుల పరిస్థితి దుర్భరంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ.పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఇరిగినేని పుల్లారెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం తిరుమలగిరి కాలనీలో పర్యటించింది. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి, కాలనీవాసులు సానెం రమణ గౌడ్, బి.ఫకీర్ రెడ్డి మాట్లాడారు. తిరుమలగిరి టౌన్‌షిప్ కాలనీ రెండేళ్ల క్రితం నగర పాలక సంస్థలో విలీనమైందని తెలిపారు. ఈ కాలనీలో సుమారు 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. కాలనీలో ఇంటి పన్నులు వేయాలంటే సచివాలయ అధికారులు స్థానికంగా ప్రయివేట్ వ్యక్తులతో కుమ్మక్కై పెద్ద మొత్తంలో లంచాలు బహిరంగంగా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా ప్రభుత్వ వాటర్ మెన్ ఉండగా అతన్ని విధులు నిర్వహించకుండా బెదిరింపులకు గురి చేస్తూ ప్రయివేట్ వ్యక్తితో పనులు చేయించి, ప్రతి ఇంటికీ రూ.200 అక్రమంగా వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా లక్ష్మీపురం గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారని, కాలనీలో జరుగుతున్న సమస్యలపై స్థానిక కార్పొరేటర్ నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమని తెలిపారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ కమిషనర్, అధికారులు కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలో ప్రయివేట్ వ్యక్తుల జోక్యం కట్టడి చేయాలని, లేకపోతే పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు నాగరాజు, సివి.వర్మ, హరికృష్ణ, స్థానికులు బి.పక్కిరెడ్డి, రాజేంద్రప్రసాద్, మురళీ రెడ్డి, రామచంద్రయ్య, సీడ్ మల్లికార్జున పాల్గొన్నారు.

తిరుమలగిరి టౌన్‌షిప్‌లో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ప్రతినిధి బృందం

జిజిహెచ్‌లో రోగులకు ఇబ్బంది లేకుండా
పారిశుధ్య చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి సమావేశ మందిరంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. శానిటేషన్‌కు సంబంధించి ప్రతి అంశానికీ ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ఉంటుందని తెలిపారు. టాయిలెట్స్ ఎన్ని సార్లు శుభ్రం చేయాలి, ఎవరు క్రాస్ చెక్ చేయాలి, తదితర అంశాలతో కాంట్రాక్టర్‌తో ఎంఒయు చేసుకుంటామని చెప్పారు. ఆస్పత్రిలో పారిశుధ్య చర్యల పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఒయులో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా రోజూ ఎన్ని బాత్ రూమ్స్ శుభ్రం చేశారు, రెండో సారి ఎప్పుడు వచ్చారు?, ఏ మెటీరియల్‌తో శుభ్రం చేశారు తదితర సూక్ష్మ వివరాలను లెక్కించి ఆ మేరకు సంబంధిత హెచ్ఒడిలు, వార్డ్ ఇన్‌ఛార్జీలు సర్టిపై చేయాలని ఆదేశించారు. అలాగే థర్డ్ పార్టీ చెక్ కూడా చేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి ఆస్పత్రి పరిశుభ్రంగా ఉండాలని, అలా లేకపోతే సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టాయిలెట్ల మరమ్మతులు, నిర్మాణాలకు సంబంధించి కూడా యాంత్రికంగా, అమానవీయంగా కాకుండా రోగులకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్‌ను రోగులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఆస్పత్రిలోని అన్ని విభాగాల హెడ్‌లను సంప్రదించి అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలను అంచనా వేసి నివేదికను ఈ నెల 23లోపు తనకు అందజేయాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎపిఎస్ఎంఐడిసి ఇఇ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. సమావేశంలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఇటీవల ప్రారంభించిన నిర్మాణాలపై థర్డ్ పార్టీతో క్వాలిటీ చెక్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో అన్ని వార్డులకు తగినంత నీటిని సరఫరా చేసేందుకు ఈనెల 24 నాటికి 3 బోర్ వెల్స్ తవ్వకం పూర్తి చేయాలని ఎపిఎస్ఎంఐడిసి అధికారులను ఆదేశించారు. జనరేటర్లకు సంబంధించి సర్వీసింగ్, మెయింటనెన్స్‌కు సంబంధించి నెలకు, సంవత్సరానికి ఎంత మొత్తం అవసరమనే వివరాలను రెండు రోజుల్లోపు నివేదికను అందజేయాలని తెలిపారు. అలాగే ఆస్పత్రిలో ఎయిర్ కండిషనర్లు కూడా ఎన్ని పని చేస్తున్నాయి, కొత్తవి ఎన్ని అవసరం, ఎంత ఖర్చు అవుతుందన్న వివరాలను రెండు రోజుల్లోపు తనకు అందజేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని అన్ని ఫ్లోర్లలోని వార్డులు, కారిడార్లలోనూ, ఎంట్రీ, ఎగ్జిట్ ప్రదేశాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ... ఆస్పత్రిలో ఇటీవల ప్రారంభించిన నిర్మాణాల్లో క్వాలిటీ పూర్‌గా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి పరిశుభ్రం కోసం ప్రతి నెలా రూ.72 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. శుభ్రత లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సెక్యూరిటీ కోసం రోజుకు రూ.1.06 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 180 మంది సెక్యూరిటీ ఉండాలని, 70, 80 మంది కూడా లేరని చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... డయాగ్నోస్టిక్ బ్లాక్ నిర్మాణానికి ముందే అన్ని సదుపాయాలూ, పరికరాలను కలిపి అంచనాలు ఇచ్చి ఉంటే బాగుండేది కదా అని ఎపిఎస్ఎంఐడిసి అధికారులను ప్రశ్నించారు. ఆస్పత్రిలోని టాయిలెట్స్ పరిశుభ్రంగా లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది సరిగా స్పందించడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ... ఆస్పత్రిలో ఇటీవల ప్రారంభించిన నిర్మాణాలపై క్వాలిటీ చెక్ చేయించాలని కలెక్టర్‌ను కోరారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు ఆలస్యంగా ఇస్తున్నందున ఎస్ఒపి ఫాలో కావడం లేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆస్పత్రి ఎడి వల్ల చెడ్డ పేరు వస్తోందని, విచారణ చేయించాలని తెలిపారు. డిఎంహెచ్ఒ కార్యాలయ సూపరింటెండెంట్ సక్రమంగా పని చేయడం లేదని, నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను విజిట్ చేయాలని సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ... ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మృతదేహాల పోస్టుమార్టం అంశంలో కొంత మంది లేబర్ ఎలాంటి జీతాలూ లేకుండా పని చేస్తున్నారని, వారికి ఎంతో కొంత మొత్తంలో జీతాలు వచ్చే విధంగా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఎమర్జెన్సీ కేర్, ఎఎంసిలలో ఎసిలు పని చేసే విధంగా చూడాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, డిఎంహెచ్ఒ డాక్టర్ రామగిడ్డయ్య, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఏకాగ్రతతో సాధన చేయాలి

- ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

క్రీడాకారులు ఏకాగ్రతతో విల్లు విద్యలో సాధన చేస్తే పతకాలు సాధించవచ్చని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. మంగళవారం కర్నూల్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆవరణలో ఆర్చరీ పోటీలను జిల్లా క్రీడా శాఖ సీఈఓ పివి రమణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో తమకు నచ్చిన క్రీడలో పాల్గొని సాధన చేస్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. అనంతరం సీఈఓ రమణ మాట్లాడుతూ క్రీడాకారులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని పతకాలు సాధించి వాటి ద్వారా వచ్చే ప్రశంసా పత్రాలతో ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విల్లు విద్య సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, కోచ్ వంశీకృష్ణ, క్రీడాకారులు భరత్, బాలాజీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

25 లేదా 28న సిఎం రాక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 25 లేదా 28వ తేదీన ఓర్వకల్ పర్యటనకు రానున్నారు. విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నామకరణ శిలాఫలకం ప్రారంభంతో పాటు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని సిఎం ప్రారంభించనున్నారు. వీటితో పాటు పలు అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సి బెళగల్

బెళగల్‌లోని మాల వీధికి చెందిన పుట్టు మూగ అయిన నాగరాజు(32) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. సోమవారం మధ్యాహ్నం బస్టాండ్ ఆవరణంలో ఛాతిలో నొప్పి అంటూ కిందపడిపోయాడు. కుటుంబీకులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక రాత్రి మృతి చెందారు. రోజు ఆయా దుకాణాల ముందు శుభ్ర పరచడం, కొందరికి టీ, టిఫిన్ తెచ్చిపెట్టడం, పెట్టింది తినడం, ఇచ్చింది తీసుకొని ఇంటికి సరుకులు పట్టుకెళ్లడం జీవనాధారంగా బతికేవాడు. అలాగే పలు పత్రికల పేపర్లకు పేపర్ బాయ్‌గా పని చేసేవాడు. ఆయనకు భార్య లక్ష్మీదేవి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

నాగరాజు (ఫైల్)

పెంచిన త్రైమాసిక పన్నును రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : వాహనాలపై ఇప్పుడున్న త్రైమాసిక పన్నుపై 25 శాతం పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లోని సిఐటియు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా సరుకు, ప్రజా వాహనాలపై త్రైమాసిక పన్నులను భారీగా పెంచడాన్ని సిఐటియు ఖండిస్తుందని అన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న రవాణా రంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఎడాపెడా పన్నులు పెంచుతూ దివాలా తీస్తున్నారన్నారు. గతంలో జీవో నంబర్ 21 విడుదల చేయడం వల్ల ఈ చలానా ధరలు, ఆర్టీఏ చలానా ధరలు భారీగా పెరగడంతో రవాణా రంగం కోలుకోలేని విధంగా తయారైందని అన్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, ఆర్టిఏ చలానా ధరలు, ఓవర్ లోడ్ పేరుతో ఆర్టిఏ అధికారుల వేధింపులు వల్ల యజమానులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. కార్మిక కుటుంబాలు రోడ్డుపై పడాల్సి వస్తుందని చెప్పారు. డ్రైవర్ల జీవితాలు ఉన్నంతలో మెరుగు పడాలంటే ప్రభుత్వం తక్షణమే పెంచిన త్రైమాసిక పన్నును రద్దు చేయాలని, లేదంటే వాహన యజమానులను, డ్రైవర్లను కదిలించి పెద్ద సంఖ్యలో ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సెపక్‌తక్రా శిక్షణ శిబిరానికి శివకుమార్ ఎంపిక

ప్రజాశక్తి - కర్నూల్ స్పోర్ట్స్

భారత సెపక్ తక్రా శిక్షణ శిబిరానికి జిల్లాకు చెందిన క్రీడాకారుడు సి.శివకుమార్ ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికైనట్లు రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి జి శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చాంబర్లో. క్రీడా సీఈఓ సి.రమణ భారత శిక్షణ శిబిరానికి ఎంపికైన శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఈఓ రమణ మాట్లాడుతూ గతంలో భారత జట్టుకు మన రాష్ట్రం తరపున పాల్గొని బంగారు పతకాన్ని సాధించారని, అదే తరహాలో గోవాలో జరగనున్న జాతీయ సెపక్ తక్రా శిక్షణ శిబిరంలో శివకుమార్ చక్కటి ప్రతిభను కనపరిచి భారత జట్టులో స్థానాన్ని సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించే వారికి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి 30 రోజులపాటు గోవాలో జరగనున్న భారత సెపక్తక్రా శిక్షణ శిబిరానికి కర్నూలు జిల్లాకు చెందిన శివకుమార్ ఎంపిక రావడం గర్వకారణమని, ఇలాంటి క్యాంపులకు ఈ క్రీడాకారుడు పాల్గొనడం ఇది మూడోసారి అని, ఈ క్యాంప్ అనంతరం ఏషియన్ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొనే భారత జట్టును ఎంపిక చేస్తారని, అందులో జిల్లాకు చెందిన శివకుమార్ కచ్చితంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన శిక్షకులు నటరాజ్, ఒలంపిక్ అసోసియేషన్ సీఈవో పి.విజయ్ కుమార్, ఒలంపిక్ అసోసియేషన్ నిర్వహక కార్యదర్శి పి. సునీల్ కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అవినాష్, ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధి పాల్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివ కుమార్ ను అభినందిస్తున్న సిఇఒ వెంకట్ రమణ

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నేడు అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కర్నూల్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2022-23 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నేడు అభినందన సభ సాయంత్రం ఐదు గంటలకు బిసైడ్ బిలాల్ మసీద్ సర్కిల్ కెసి కెనాల్ వైపు లక్ష్మీ నగర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అభినందన సభకు గౌరవ అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.భరత్, సామాజిక ఉద్యమకారిని ఆర్జాఉష, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కే సురేష్ కుమార్, న్యాయవాది కేడీబీఏ ఉపాధ్యక్షులు ఎస్.షాబుద్దీన్ హాజరుకానున్నారని, కావున విద్యార్థులు తల్లిదండ్రులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

- మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాను కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులు ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైతే మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. దాదాపు 914 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారని చెప్పారు. వీరిలో 224 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ వెంకట సుబ్బయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ రమణారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, సీడ్ ఆఫ్ జిల్లా మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

అలరించిన జబర్దస్త్ కళాకారులు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు నగరంలోని టిజివి కళాక్షేత్రంలో జబర్దస్త్ కళాకారులు అలరించారు. తెలుగునాట నవ్వులపూలు పండిస్తున్న టీవీ కామెడీ షో జబర్దస్త్‌కున్న పేరు అంతా ఇంతా కాదు.. సినీ హీరోలకున్న క్రేజ్ జబర్దస్త్ కళాకారులకుంది.. మంగళవారం రాత్రి టీజివి కళాక్షేత్రంలో అతిరథమహారథుల మధ్య జబర్దస్త్ షో నిర్వహించారు. ఈ షోను రాజ్యసభ మాజీ సభ్యులు టీజి వెంకటేష్ ప్రారంభించారు. వినోదిని హాస్యం అలరించింది.

నూతన సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, అన్ని రకాల సర్వీసులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. సచివాలయాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సహెరబి, ఎంపిటిసి మధుసూదనమ్మ, కల్లూరు మండల జడ్పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, ఎంపిపి శారద, కర్నూలు నగర మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాయకల్లు చంద్రశేఖర్ రెడ్డి, పెద్దటేకూరు ఎంపిటిసి మునిస్వామి, తహశీల్దార్ టీవీ రమేష్ బాబు, ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, పిఆర్ ఏఈ అచ్యుతానంద రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, జి.సోమన్న, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబి, బీమా మిత్ర ధనలక్ష్మి, ఉలిందకొండ రమణారెడ్డి, చిన్నటేకూరు ఈశ్వరయ్య, నారాయణ, కొంగనపాడు కేశవరెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తడకనపల్లె గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

బాల్య వివాహాలను ఆపండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

డివిజన్‌లో బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో బాల్య వివాహాల సంపూర్ణ నివారణపై డివిజన్‌లోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదరికం, నిరక్షరాస్యత, వలసలు, మూఢ నమ్మకాలు, ఆడపిల్లల భద్రత తదితర కారణాల వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. బాల్య వివాహాల నివారణకు రాష్ట్రంలోని మహిళా కలెక్టర్లు, మహిళా ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఆడ పిల్లలకు చిన్నవయస్సులో వివాహాలు చేయడం వల్ల మాతృ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఆడ పిల్లల భవిష్యత్తు బాగుండేలా సమాజంలో మార్పునకు అధికారులతోపాటు ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. బాల్య వివాహాలపై 1902 నెంబర్‌కు కాల్ చేసి అధికారులకు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను వాలంటీర్లు, ఎఎన్‌ఎంలు గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గర్భిణులు, కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్త హీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందిస్తోందన్నారు. వాటిని వేసుకునేలా అంగన్వాడీ సిబ్బంది, ఎఎన్‌ఎంలు దృష్టి పెట్టాలన్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా, బడి మానేయకుండా సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, సిడిపిఒ ఉమామహేశ్వర, ఎంపిడిఒ గీతావాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రహదారి భద్రత నియామాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడ నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపిడిఒ గీతావాణి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నాగరికతకు చిహ్నాలు దేవాలయాలు

- జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

తిమ్మాపురం పెద్దలకు విరాళం అందజేస్తున్న జడ్‌పిటిసి

నాగరికతకు, సాంప్రదాయాలకు విలువనిస్తూ పురాతన కాలం నుంచి కూడా పెద్దలు దేవాలయ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్మించారని ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి పేర్కొన్నారు. మంగళవారం నగరడోనా పంచాయతీలోని మజరా గ్రామమైన తిమ్మాపురంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి సర్పంచి నాగేంద్ర, తిమ్మాపురం గ్రామ పెద్దలు జడ్‌పిటిసి విరుపాక్షిని కలిసి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు స్పందిస్తూ వెంటనే రూ.30 వేలు అందజేశారు. మున్ముందు కూడా తన సహాయ, సహకారాలు అందిస్తానని హామీఇచ్చారు. గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

మాచుమాన్‌దొడ్డిలో ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పథకం కింద మండలంలోని మాచుమాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన పథకం కింద పశుసంవర్థక శాఖ తరుపున పశువులకు చికిత్స, ఉచిత మందులు అందించినట్లు తెలిపారు. పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించి వాటికి తగిన జాగ్రత్తలు ఎలా తీసుకోవాలని సూచించారు. వాటర్‌షెడ్ క్లస్టర్ టిఎ గోవిందప్ప, ప్రాజెక్ట్ టిఎ శివ, వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్ బొడ్డన్న, గోపాలమిత్ర నల్లన్న, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు.

టిడిపికి విధేయుడు.. మరి బీవీకి..?

- అధికారంలో లేని నాలుగేళ్లు బీవీ వెంటే - నమ్మించి మోసం చేశాడంటూ బీవీకి దూరం
- కోట్ల గ్రూపులో చేరితే బీవీ టికెట్‌కు ఎసరు..? - పార్టీలో చాపకింద నీరులా కోట్ల వర్గం కదిలికలు..!
- దేశాయి మాధవరావు రూటు ఎటువైపు..!

ప్రజాశక్తి - నందవరం

టిడిపి అధికారంలో ఉండగా ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా మాధవ రావు దేశాయికి పదవి ఇచ్చారు. అది స్టే రావడంతో మూన్నాళ్ల ముచ్చటగానే ముగిసింది. 2019లో టిడిపి అధికారం కోల్పోయినా మాధవరావు దేశాయి మాత్రం మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి వెంటే నడిచారు. దాదాపు నాలుగేళ్ల ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీని, బీవీని వదలకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. కొంతమంది నాయకులు ఆయనపై కక్షతో గత నాలుగేళ్ల నుంచి పార్టీకి దూరంగా ఉన్నా గ్రూపును పార్టీలో చేరదీయడంతో బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి దూరంగా ఉంటున్నారు. అలాగే నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కూడా ఆయన ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ఎక్కడా బీవీ ఫొటో లేకుండా, సొంతంగా పాదయాత్రలో పాల్గొని తన బలాన్ని నిరూపించుకున్నారు. తన రాజకీయ శత్రువైన గ్రూపును చేరదీయడం ఎంతవరకు న్యాయమని, బీవీ మరో గ్రూపు పార్టీలోకి తిరిగి వస్తున్నారని తెలిసినా తనను అవమానించడానికే సమాచారం ఇవ్వలేదని, కొంతమంది టిడిపి నాయకులతో ఆయన అన్నట్లు సమాచారం. మాధవ రావు బీవీకి దూరం కావడంతో కోట్ల గ్రూపునకు చెందిన కొంతమంది నాయకులు ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కూడా తన కుమారుని రాజకీయ అరంగ్రేటం చేసేందుకు సిద్ధమయ్యారని, అందుకోసం అధిష్టానంపై తీవ్ర ఒత్తిడి తెచ్చి, ఎమ్మెల్యే టికెట్ సాధించేందుకు నియోజకవర్గంలో తన గ్రూపును పటిష్టంగా ఏర్పాటు చేసుకునేందుకు బీవీపై అసంతృప్తి ఉన్న నాయకులను తన గ్రూపులోకి రప్పించుకునేందుకు మాధవరావు దేశాయిని సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే నియోజకవర్గంలోని అసంతృప్తి నాయకులు కోట్ల గ్రూపులో చేరారు. ఎమ్మిగనూరు, గోనెగండ్లలో పటిష్టమైన కోట్ల గ్రూపు చురుకుగా పని చేస్తోందని, ఒక్క నందవరం మండలంలో లేకపోవడంతో మాధవ రావును తన గ్రూపులోకి తెచ్చుకుంటే, మండలంలోని కొంతమంది అసంతృప్తి నాయకులను కూడా కోట్ల గ్రూపులోకి తీసుకొస్తారనే ఉద్దేశంతో ఆయనను సంప్రదించినట్లు సమాచారం. నెలలోపు తన కార్యాచరణ ప్రకటిస్తానని తన అనుచరులతో అన్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని అసంతృప్తి నాయకులంతా ఏకమైతే బీవీకి ఎమ్మెల్యే టికెట్ వచ్చే మార్గం కష్టమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులోని సచివాలయంలో మూడో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడప గడపకు తిరిగి ఆయా ఇళ్లలో లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో ప్రతి కుటుంబానికీ సంక్షేమం పథకాల రూపంలో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి తీసుకొచ్చిన వాలంటీర్, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇంకా అర్హత ఉండి పథకాలు అందనివారూ ఎవరైనా ఉంటే వాలంటీర్ల ద్వారా దరఖాస్తులను సచివాలయాల్లో అందజేస్తే పథకాలు మంజూరవుతాయన్నారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు పరిధిలో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న జగన్మోహన్ రెడ్డి

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా మధుసూదనశర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఎపి బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య నూతన అధ్యక్షులుగా సమాఖ్య సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లాల మధుసూదన శర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. తాను ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి, ప్రధానకార్యదర్శి పోతావజ్ఝల పురుషోత్తమశర్మ (తెనాలి)ను, కోశాధికారిగా కౌతా సుబ్బారావు (విజయవాడ) ఎన్నికకు సహకరించిన మాజీ అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్‌కు, ప్రధాన కార్యదర్శి యనమండ్ర సాయీ సురేష్‌కు, కోశాధికారి పోతావజ్ఝల పురుషోత్తమ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

మధుసూదన శర్మను సన్మానిస్తున్న నాయకులు

ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ

జవాబుదారీతనంతో పనిచేయాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగీ ప్రజలకు జవాబుదారీ తనంతో పని చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కైరుప్పల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని, రూ.20.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి జయరామ్ ప్రారంభించారు. గ్రామంలో వాలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ప్రజలు మంత్రి దృష్టికి తెచ్చారు. ఎంపిడిఒ రాధను పిలిచి ప్రజలకు సేవలు అందించని 8 మంది వాలంటీర్లను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు.

గడప ముందుకే సచివాలయ సేవలు

గ్రామ, వార్డు సచివాలయం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండి అక్కడికక్కడే వారి సమస్యలను పరిష్కరించడానికి సచివాలయ వ్యవస్థ తోడ్పడుతుందని మంత్రి జయరామ్ తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి ఎరువులను రైతు భరోసా కేంద్రంలోనే అందిస్తున్నామని చెప్పారు. రైతులకు పెట్టుబడిగా రైతు భరోసా, పంట నష్టం వస్తే వాటికి పంటల బీమా అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ములుగుందం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు నీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి... నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా పూలమాలలు, శాలువాలతో మంత్రిని ఘనంగా సన్మానించారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, సొసైటీ ఛైర్మన్ కట్టెల గోవర్ధన్, జిల్లా కెడిసిసి డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్‌పిటిసి దొరబాబు, మండల కన్వీనర్ పెద్దయ్య, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, సర్పంచి తిమ్మక్క, సొసైటీ సిఇఒ అశోక్, నాయకులు బసవరాజు, ప్రభాకర్ రెడ్డి, హనుమంతు, విజయ్ కుమార్, నరసింహులు, శివ, కౌలుట్లయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలి

- జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రతి శుక్రవారమూ డ్రైడే-ఫ్రైడేగా పాటించాలని వైద్యాధికారులు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దహరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ ఇమ్రాన్ అహ్మద్ మాట్లాడారు. డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. లార్వా వ్యాప్తి చెందకుండా పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా, మురికి గుంటలు ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లోని పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ల్యాబ్ టెక్నిషన్ సుమలత, సిహెచ్ఒ కృష్ణవేణి, ఎఎన్‌ఎంలు జి.పుష్పలత, పి.లక్ష్మ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

- మండల అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

జగనన్న కాలనీలో ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారుడూ ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సుధాకర్ రాజు కోరారు. మంగళవారం నగరడోన, రామదుర్గం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాలన్న, సిసింద్రీ ఆధ్వర్యంలో అధికారులందరూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తోందని తెలిపారు. బేస్ మట్టం వేయని లబ్ధిదారులు కూడా త్వరగా పూర్తి చేసుకునేటట్లు అవగాహన కల్పించాలని హౌసింగ్ అధికారులకు, సచివాలయ అధికారులకు సూచించారు. ఎపిఎం నాగార్జున, హౌసింగ్ ఎఇ భవ్య పాల్గొన్నారు.

పెద్దకడబూరుకు బస్సు వేయాలి

- ఆదోని డిఎంకు సిపిఎం వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

ఆదోని నుంచి పెద్దకడబూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. సిపిఎం ఆదోని డిఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న, సిఐటియు మండల కార్యదర్శి ఉప్పర ఈరన్న మాట్లాడారు. స్కూల్ ఉన్నప్పుడు మాత్రమే పెద్దకడబూరుకు బస్సు వస్తుందని, స్కూల్ అయిపోయిన తర్వాత బస్సును రద్దు చేస్తున్నారని తెలిపారు. స్కూలు ఉన్నా, ఉండకపోయినా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కల్లుకుంట మీదుగా పెద్దకడబూరు, చిన్న తుంబలం వరకు బస్సు వేయాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కచ్చితంగా ఆలోచించి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీఇచ్చారు.

వివాహానికి మీనాక్షి నాయుడు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని 19వ వార్డు మండగిరి కాలనీకి చెందిన రెహమాన్ కుటుంబంలో వివాహానికి టిడిపి టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. రెహమాన్ కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి 19వ వార్డు ఇన్‌ఛార్జీ మండగిరి శ్రీనివాస్ ఆచారి పాల్గొన్నారు.

ఉపాధి పనుల దగ్గర జాగ్రత్తలు అవసరం : ఎపిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

గత వారం నుంచి అధికంగా ఎండలు ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులు చేసుకునే దగ్గర తగిన జాగ్రత్తలతో ఉండాలని ఎపిఒ మాధవ శంకర్ ఉపాధి హామీ కూలీలకు సూచించారు. మంగళవారం రామదుర్గం, కుందనగుర్తి గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్, నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతం దగ్గర పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉదయం ఎంత త్వరగా వస్తే అంత త్వరగా పనులు చేసుకుని వెళ్లడానికి వీలుంటుందని తెలిపారు. వేతనం రూ.272 వర్తించేలా పనులు చేసుకోవాలన్నారు. రెండు, మూడు వారాల నుంచి వేతనాలు త్వరగా వస్తున్నాయన్నారు. ఉపాధి పనులను రోజూ 4,500 మంది వరకు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. పనులు దగ్గర తప్పనిసరిగా తాగునీరు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలు

- వైద్యాధికారిణి శాంతి జ్యోతి

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

మండలంలోని జర్నలిస్టులకు ఆరోగ్యరీత్యా ఏ సమస్య వచ్చినా ఉచితంగా వైద్యం అందిస్తామని వైద్యాధికారిణి శాంతి జ్యోతి భరోసా ఇచ్చారు. మంగళవారం పెద్దకడబూరు గ్రామంలో ఎపియుడబ్ల్యుజె మండల కమిటీ ప్రారంభోత్సవ సభలో ఆమె మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఆదోని స్టార్ నర్సింగ్ ఆస్పత్రికి ఏ ఆరోగ్య సమస్యతో వచ్చినా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని ప్రెస్ క్లబ్‌లో హామీ ఇచ్చారు.

ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

రాష్ట్రంలోని ముస్లిం, మైనార్టీలకు అండగా ఉంటామని, వారి ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆదోని కమిటీ అధ్యక్షులు ముస్తాక్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్తున్న వారి కోసం గత పదేళ్లుగా భోజన వసతి కల్పిస్తున్న మూన్ ఆప్టికల్స్ యజమాని సలాం సాబ్‌ను ప్రత్యేకంగా అభినందించి, అతని కుమారుడు షాబాజ్‌ను సన్మానించారు. ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు అందరూ ముందుకు రావాలని, పదేళ్లుగా సేవా కార్యక్రమం చేస్తున్న మూన్ ఆప్టికల్స్ యజమాని సలాం అభివృద్ధి కోసం దువా చేయాలని హజ్ యాత్రికులకు విన్నవించారు. దేశంలో ఎక్కువ ప్రాంతాల్లో పార్టీల గెలుపోటముల్లో ముస్లిం, మైనారిటీలు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారని తెలిపారు. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంలో ముస్లింలు తనకు ఎంతో సహకరించారని చెప్పారు. ఇకముందు కూడా తనకు అలాంటి సహకారం అందించాలని కోరారు. ఆదోని నుంచి ముస్లిం, మైనారిటీలకు రాష్ట్ర ప్రభుత్వంలో రాష్ట్ర, జిల్లా, మున్సిపాలిటీ స్థాయి పోస్టులు సాధించారని తెలిపారు. రాష్ట్ర కమిటీలో ముగ్గురు డైరెక్టర్లను, జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా, మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా ముస్లింలను నియమించినట్లు చెప్పారు. ఈద్గా నిర్మాణం కోసం రూ.2.60 కోట్లు మంజూరు చేయించి టెండర్లు కూడా పిలిచామని, త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. మైనార్టీ ఐటి కళాశాలను త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రభుత్వ బాలికల ఉర్దూ కళాశాలను ఆదోనిలో ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం స్థల పరిశీలన పూర్తయిందని చెప్పారు. అర్థాంతరంగా ఆగిపోయిన షాదీ ఖానా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. విజయవాడ నుంచి వెళ్తున్న సుమారు 1831 మంది యాత్రికుల కోసం ప్రత్యేకంగా రూ.14.51 కోట్లు ప్రభుత్వం భరిస్తోందని, ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ జిఒను జారీ చేసిందని తెలిపారు. ప్రతి యాత్రికుడిపైనా రూ.80 వేల భారం పడుతోందని ప్రచారం చేశారని, ఆ భారాన్ని మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. శిక్షకులు మౌలానా అబ్దుల్ మజీద్, కౌడల్ పేట్ సయ్యద్ అమన్, ఎస్ఎంబి.హన్ను, అహ్మద్, అహ్మద్ హుస్సేన్, అల్తాఫ్ పాల్గొన్నారు.

పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం

- డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో వివిధ రకాల పండ్లు, మునగ లాంటి తోటలను సాగు చేసే రైతులకు తగిన ప్రోత్సాహన్ని అందిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఉపాధి హామీ చట్టం పనులతో పాటు హార్టికల్చర్ కింద సాగు చేస్తున్న పండ్ల తోటలను పరిశీలించారు. ముందుగా కులుమాల గ్రామంలో ఫారం పాండ్స్ పనులు, చిన్న మరివీడు గ్రామంలో రైతులు సాగు చేసిన స్వీట్ ఆరెంజ్ తోటను పరిశీలించారు. తర్వాత అల్వాల గ్రామ పరిధిలో జరుగుతున్న ఎంఎల్ఎస్‌పి కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం గోనెగండ్లలోని ఉపాధి హామీ చట్టం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హార్టికల్చర్ కింద మండలంలో రైతులు మామిడి, సపోట, జామ, స్వీట్ ఆరెంజ్ లాంటి పండ్లతో పాటు మునగ తోటలను సాగుచేసుకుని ఆర్థికంగా లబ్ధిని పొందాలని సూచించారు. ఈ పథకం కింద పంటల పండ్ల తోటలను సాగు చేసుకునే చిన్న, సన్నకారు రైతులకు కావాల్సిన మొక్కలను అందజేయడం, రైతులే సొంతంగా మొక్కలను కొనుగోలు చేసుకుంటే దానికయ్యే ఖర్చును అందజేస్తామని తెలిపారు. నెలనెలా ఆ మొక్కల నిర్వహణకు అయ్యే ఖర్చులను రెండు నుంచి మూడేళ్ల పాటు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు వారి గ్రామంలోని సచివాలయాలను కానీ, గోనెగండ్లలోని ఉపాధి హామీ చట్టం కార్యాలయంలో కానీ సంప్రదించాలని కోరారు.

ఉదయం పూటనే పనులు ముగించుకోవాలి

ఉపాధి కూలీలు పనులకు ఉదయం 6.30 గంటలకు హాజరై 10.30 గంటల వరకు పని చేసి ఎండ వేడి నుంచి ఇబ్బందులు పడకుండా ఉండాలని సూచించారు. సంబంధిత సిబ్బంది కొలతల మేరకు పనిచేసి గరిష్ట వేతనం రూ.272 పొందాలని అన్నారు. ఎపిఒ ఉస్మాన్, టెక్నికల్ అసిస్టెంట్ వీరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథరెడ్డి

18న వికలాంగుల 'చలో కలెక్టరేట్'

- విహెచ్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 18న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు విహెచ్‌పిఎస్ తాలూకా అధ్యక్షులు కె.రామాంజనేయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీసీ.నాగరాజు తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలు సామాజిక పింఛన్లు పెంచాలని, వికలాంగుల సంక్షేమ హక్కుల చట్టం-2016ను అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలపై విహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 18న 'చలో కలెక్టరేట్' చేపడుతున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ పాల్గొంటున్నారని చెప్పారు. విహెచ్‌పిఎస్ తాలూకా కార్యదర్శి ఎం.పెద్దయ్య, పట్టణ అధ్యక్షులు బి.రఘువీరా, మండల అధ్యక్షులు బి.శ్రీనివాసులు, బి.రంగన్న, కోశాధికారి బి.తిక్కయ్య, ఈసీ మెంబర్లు కడిమెట్ల జి.నాగరాజు, వి.నరసింహులు, ఎం.రామకృష్ణ, రామదాస్, పాండు, రంజాన్, జబ్బార్, విహెచ్‌పిఎస్ గోనెగండ్ల మండల నాయకులు బి.సోమన్న, నాగశేషమ్మ, బాషా, రంగన్న, విహెచ్‌పిఎస్ నందవరం మండల నాయకులు గుంటెప్ప, మంగలి నాగరాజు, బసవరాజు, లక్ష్మన్న, మంగమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామాంజనేయులు

గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి - దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

నిరుద్యోగ యువత, విద్యార్థులు గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మంగళవారం దేవనకొండ గ్రంథాలయంలో లైబ్రేరియన్ అశోక్ అధ్యక్షతన 'గ్రంథాలయాల అభివృద్ధి-ప్రజల భాగస్వామ్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో లభించేలా వైసిపి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, నవలలు, కథల పుస్తకాలు సైతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువత, విద్యార్థులు సెల్ ఫోన్లలో నిమగ్నం కాకుండా పుస్తకాలు చదువుకునేలా ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులు చొరవ చూపాలని కోరారు. దేవాలయాలు, విద్యాలయాలతో సమానంగా ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లాలో అన్ని పంచాయతీల్లో ఇంటి పన్నులో 8 శాతం గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ పన్ను రూపేణా వచ్చే ఆదాయాన్ని మాత్రం గ్రంథాలయాలకు చెల్లించకపోవడం దారుణమన్నారు. జిల్లాలో రూ.24 కోట్లు గ్రంథాలయ పన్ను రావాల్సి ఉందని, ఆయా పంచాయతీలు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదువుకోవడానికి శాశ్వత సభ్యత్వం రూ.100 చెల్లించాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పలువురు సభ్యత్వం తీసుకున్నారు. జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, ఆలూరు మాజీ జడ్‌పిటిసి రామ్ భీంనాయుడు, తెర్నేకల్ మాజీ సర్పంచి రాజన్న, వైసిపి నాయకులు మీనుగ కృష్ణ, చందమామ రాముడు, బెల్లం దొడ్డి రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'వైఎస్ఆర్ మత్స్యకార భరోసా'

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్కూటర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ వైఎస్ఆర్ మత్స్యకార భరోసా సహాయం అందుతుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మంజూరైన స్కూటర్లను మంగళవారం రాంపురం గ్రామంలో మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల పునరుత్పత్తి సమయమని, వేట నిషేధమని తెలిపారు. రాష్ట్రంలోని మత్స్యకారుల కుటుంబాలు ఇబ్బంది పడకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి వైఎస్ఆర్ మత్స్యకార భరోసా సహాయం కింద రూ.10 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్కూటర్ రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. వైసిపి మండల ఇన్‌ఛార్జి మురళీ మోహన్ రెడ్డి, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ చంద్రకళ పాల్గొన్నారు.